క్లుప్తంగా

సైనిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారు సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక శిక్షణ విద్యాలయానికి చెందిన విద్యార్థులు వేదిక్ మ్యాథ్స్ అండ్ కార్టూన్ మేకింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. తొమ్మిదో తరగతి విద్యార్థి అజయ్ బెస్ట్ పర్ఫార్మర్ ట్రోఫీ గెలుచుకున్నాడు. అలాగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ టోర్నమెంట్ నిజామాబాద్‌లో జరగగా అప్‌కమింగ్ బాక్సర్ ట్రోఫీని గెలుచుకున్నాడు. ఈ నెల 10 నుంచి 12 వరకు ఆదిలాబాద్‌లో రాష్ట్ర స్థాయి జూనియర్ హాకీ టోర్నమెంట్‌లో విద్యార్థి దుర్గరాజ్ రాణించి ప్రత్యేక బహుమతి సాధించాడు. విద్యార్థులను ప్రిన్సిపాల్ కాళహస్తి అభినందించారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

శంకరపట్నం: ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంద రాజు కోరారు. మండలంలోని కేశవపట్నంలో శనివారం ఎమ్మార్పీఎస్ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా కులాలకు కృతజ్ఞతలు తెలిపారు. జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో జెండా ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అనిల్, శేఖర్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మధునయ్య, శంకర్, భద్రయ్య,రవి, సమ్మయ్య, భూమయ్య, నర్సయ్య, సతీష్, కిష్టయ్య, మహేశ్, రమేశ్, నరేశ్, లింగస్వామి, సుధాకర్, రాజమల్లు పాల్గొన్నారు.

సంస్మరణ సభ


జ్ఞాపిక అందిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

జమ్మికుంట: పట్టణంలో సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం నరహరి ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన నేత్రదాత ఎలిమిల్ల పుల్లయ్య శనివారం నివాసంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్రదానంపై అవగాహన కల్పించారు. పుల్లయ్య కొడుకులు రాజేంద్రప్రసాద్, సంపత్‌కు జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, మార్కెట్ మాజీ చైర్మన్ పొల్నేని సత్యనారాయణ, జమ్మికుంట మాజీ సర్పంచ్ పొనగంటి మల్లయ్య, గర్రెపెల్లి వెంకటేశ్వర్లు, బచ్చు వీరలింగం, వొల్లాల బాపుశెట్టి, ముస్త్యాల జగదీశ్వర్, సారంగపాణి పలువురు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఆధ్వర్యంలో చండీయాగం

తిమ్మాపూర్: తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో మండలంలోని ఎల్‌ఎండీ కాలనీ శ్రీతాపాల లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో శనివారం చండీయాగం నిర్వహించారు. ఆదివారం కూడా యాగం చేపడతామని ఫోరం జిల్లా అధ్యక్షుడు కనకం కుమారస్వామి తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు తిరునగిరి వెంకటాద్రి ఆధ్వర్యంలో ఉదయం నుంచి పలు పూజా కార్యక్రమాలు చేశారు. లోక కల్యాణార్థం శ్రీచండీ రుద్రసహిత సుదర్శన నారసింహ మహా యాగం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా నాయకుడు రవీందర్ రెడ్డి, ఎడ్ల జోగిరెడ్డి, ఐల ప్రసన్న, పోతు జ్యోతి రెడ్డి, భూమా సదానందం, నోముల శ్రీనివాస్ గౌడ్, గోషెట్టి సంజు, దేవునూరి అంకూస్, మొగిలి, శ్రీధర్, భూడిద వినోద్ కుమార్, ల్యాగల బాపు రెడ్డి, బొజ్జ ఎల్లయ్య, మెంగని చంద్రశేఖర్ ఉద్యమకారులు, తదితరులున్నారు.

ఒకరికి గాయాలు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. ఆముదాలపల్లి గ్రామానికి చెందిన శ్రీధర్‌రెడ్డి బైక్‌పై వెళ్తుండగా మొలంగూర్‌లో గేదె అడ్డురావడంతో అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. గాయపడిన వ్యక్తిని 108లో హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

డాక్టర్ భూంరెడ్డికి నివాళి

కొత్తపల్లి: కరీంనగర్‌లోని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ఆర్‌బీవీఆర్‌ఆర్ విగ్రహం వద్ద శనివారం రెడ్డి ఐక్య వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యుడు భూంరెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు బండ గోపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వంచ సుదర్శన్ రెడ్డి, నాయకులు సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మధూకర్‌రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, జగన్నాథరెడ్డి, రాంరెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రజితరెడ్డి, రాజిరెడ్డి, కిరణ్ రెడ్డి, శేఖర్ రెడ్డి, మల్లారెడ్డి, మహేందర్ రెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, బి.శ్రీనివాస్ రెడ్డి, సాగర్ రెడ్డి, సమ్మిరెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా నల్లమట్టి తరలింపు

- పట్టించుకోని అధికార యంత్రాంగం
- రాత్రివేళ గుట్టుగా దందా
- అడ్డుకుంటున్న గ్రామస్తులు


షానగర్ చెరువు నుంచి జేసీబీ సాయంతో టిప్పర్లలో మట్టి తరలింపు(ఫైల్)

రామడుగు: మండలంలో నల్లమట్టి తరలింపు మాఫియా రెచ్చిపోతోంది. అధికారుల అనుమతి ఉందంటూ ఇష్టారాజ్యంగా చెరువులు, కుంటల్లో నుంచి లారీల్లో ఇటుక బట్టీలకు మట్టిని తరలించుకుపోతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. రాత్రివేళ జేసీబీల సహాయంతో గుట్టుగా మట్టిని తరలించుకుపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్లమట్టిని పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన ఓ ఇటుకబట్టీ యాజమాని తీసుకువెళ్తున్నట్టు ఆరోపణలు. ప్రభుత్వ అనుమతితో తీసుకెళ్లాల్సింది గోరంతైతే అక్రమంగా తీసుకెళ్తుంది కొండంత. ఇటీవల మండలంలోని షానగర్ ఊరచెరువు నుంచి మట్టి తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. తర్వాత గుండి ఊర చెరువు మట్టిని తీసుకెళ్లారు. మట్టి నాణ్యతగా లేకపోవడంతో అక్కడి నుంచి చిప్పకుర్తి ఊర చెరువు మట్టి తీసుకెళ్లడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. దీన్ని కూడా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇటీవల రాత్రిళ్లు మట్టితరలిస్తున్నారని కొందరు పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే కోరటపల్లి చెరువులోని రైతుల పొలాల నుంచి మట్టిని తీసుకెళ్తున్నారు. ఇటుక బట్టీల మాఫీయా మండలంలోని పలు చెరువుల నుంచి నల్లమట్టి తరలింపును మొదలుపెట్టింది. గ్రామస్తులు, రైతులు అడ్డుకుంటున్నా బెదిరింపులకు పాల్పడుతున్నారు. సంబంధిత అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపణలు వెలువడుతున్నాయి. ఇకనైనా చర్యలు చేపట్టాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమణకు గురైన రోడ్డు తిరిగి స్వాధీనం



తిమ్మాపూర్: కొత్తపల్లి గ్రామ శివారులో ఇటీవల ఆక్రమణనకు గురైన దారిని శనివారం పోలీస్ బందోబస్తు మధ్య అధికారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ప్రొక్లెయిన్ సహాయంతో రోడ్డు ఏర్పాటు చేశారు. కొందరు దారిని ఆక్రమించారని ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమంలో పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు దారి విషయంపై దృష్టి సారించి పలుమార్లు సర్వేలు నిర్వహించారు. త్వరలోనే సీసీరోడ్డు పనులు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి వివరణ ఇచ్చారు. కాగా ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని ఇటీవల ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

అధిక ధరలకు పుస్తకాల విక్రయం

- విద్యను వ్యాపారంగా మారుస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలు
- ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి


ధర్నా చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

తిమ్మాపూర్: నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు పుస్తకాలు విక్రయిస్తూ శ్రీచైతన్య పాఠశాలలు విద్యను వ్యాపారంగా మారుస్తున్నాయని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ఆరోపించారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాల బుక్‌స్టోర్ వద్ద శనివారం ధర్నా నిర్వహించి స్టోర్‌ను సీజ్ చేయించారు. నిబంధనలు పాటించకపోతే భౌతిక దాడులకు దిగుతామని హెచ్చరించారు. విద్యాశాఖ నిబంధనలను పాటించకుండా, పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా మార్చాయని, పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తూ, తల్లిదండ్రుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. పాఠశాల స్టోర్‌లోనే పుస్తకాలు కొనుగోలు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులను బెదిరిస్తున్నారని, అంతేకాకుండా 'టెక్నో' పేరిట ప్రచారం చేస్తూ ఫీజుల నియంత్రణ చట్టాన్ని ఉల్లంఘిస్తూ విద్యతో రూ.లక్షలు పోగు చేసుకుంటున్నారని ఆరోపించారు. ఒక్క రూపాయి అధికంగా వసూలు చేసినా సహించమన్నారు. విద్యాశాఖ అధికారులు, ఎంఈవో శ్రీనివాస్ తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎస్సై రవీందర్‌రెడ్డి స్టోర్‌కి తాళం వేయించి ధర్నాను విరమింపజేయించారు. ధర్నాలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి హేమంత్, జిల్లా కార్యవర్గ సభ్యుడు నూనావత్ శ్రీనివాస్, జిల్లా నాయకులు సందీప్ రెడ్డి, జ్ఞానేశ్వర్, పవన్, వినయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు పూర్తి చేయాలని ధర్నా


గుండ్లపల్లి స్టేజీ వద్ద రాజీవ్ రహదారిపై ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి స్టేజీ నుంచి గన్నేరువరం మీదుగా ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు డబుల్ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. గుండ్లపల్లి స్టేజీ వద్ద రాజీవ్ రహదారిపై శనివారం పార్టీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తే మా వల్లే డబుల్ రోడ్డు మంజూరైందని కాంగ్రెస్ పార్టీ నాయకులు గొప్పలు చెప్పుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పనులు నత్తనడకన సాగుతున్నాయని, కంకర రోడ్డుపై ప్రయాణానికి వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని, తక్షణం రోడ్డు పనులు పూర్తి చేయకుంటే ప్రజలతో కలిసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏలేటి చంద్రారెడ్డి, సుజాతరెడ్డి, సొల్లు అజయ్‌వర్మ, పుల్లెల రాము, విలాసాగరం రామచంద్రం, అటికం రామచంద్రం, బండి తిరుపతి, చెక్కిళ్ల చంద్రయ్య, బద్దం అనంతరెడ్డి, విలాసాగరం రాజమల్లు, దొగ్గలి జగన్, బుర్ర చంద్రశేఖర్‌గౌడ్, గట్టు కిషన్, స్వామిరెడ్డి, జాలి శ్రీనివాస్‌రెడ్డి, నరసింహస్వామి, పకిడి మహేందర్, గాదె వెంకన్న, సింగిరెడ్డి రాంరెడ్డి, ఏలేటి శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రఫుల్ దేశాయ్‌ను శనివారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. విలీన గ్రామాల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె.రాంరెడ్డి, దుర్శేడ్ అధ్యక్షుడు బుర్ర హరీశ్‌గౌడ్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

కరీంనగర్‌టౌన్: నగరపాలక సంస్థ 30వ డివిజన్ మారుతీనగర్ వార్డు ఆఫీసులో శనివారం ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు ఎన్‌సీడీ, హెపటైటిస్, టీబీ, హెచ్‌ఐవి, బీపీ, షుగర్ వంటి అన్ని రకాల పరీక్షలు చేశారు. వరల్డ్ బ్లడ్ డోనర్స్ డే పురస్కరించుకొని రక్తదానం గురించి అవగాహన కల్పించారు.్ అడిషనల్ డీఎంహెచ్‌వో సుధా రాజేంద్రన్, మెడికల్ ఆఫీసర్ సాయిప్రసాద్, డీపీఎం సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్‌రూరల్: గోదావరిఖనికి చెందిన కోట సందీప్ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను కరీంనగర్‌రూరల్ పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా స్వాధీనం చేసుకుని శనివారం బాధితుడికి సీఐ నిరంజన్‌రెడ్డి అందించారు. సందీప్ ఫిబ్రవరిలో సెల్‌ఫోన్ పోగొట్టుకోగా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్ విశ్వతేజ టెక్నాలజీ ద్వారా వరంగల్‌లో ఉన్నట్లు గుర్తించాడు. సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని సందీప్‌కు సీఐ అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తిమ్మాపూర్: మండలంలోని కొత్తపల్లి స్టేజ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎల్‌ఎండీ కానిస్టేబుళ్లు నరేశ్, లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు.. చిగురుమామిడి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన ఎన్.లింగమూర్తి(58) కొత్తపల్లి వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వెళ్తున్న కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలుకావడంతో లింగమూర్తి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

అభివృద్ధే ధ్యేయంగా బీజేపీ పాలన


హుజూరాబాద్: మాట్లాడుతున్న వాసాల రమేశ్


గుండ్లపల్లిలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సంపత్

హుజూరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తోందని బీజేపీ నాయకుడు వాసాల రమేశ్ అన్నారు. శనివారం హుజూరాబాద్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద మోదీ పదకొండేళ్ల సేవా సుపరిపాలన పేదల సంక్షేమం సంకల్ప సభ నిర్వహించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న గ్లోబల్ ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నిటిని ప్రజలకు వివరిస్తే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు గంగిశెట్టి ప్రభాకర్,తూముల శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు, మాజీ కౌన్సిలర్ పైళ్ల వెంకట్‌రెడ్డి, గంగిశెట్టి రాజు, నల్ల సుమన్, కో కన్వీనర్ బొరగాల సారయ్య, కొలిపాక వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే పీఎం మోదీ లక్ష్యం

గన్నేరువరం: సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ పాలనతో భారతదేశ దిశదశ మారిపోయిందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దుర్శెట్టి సంపత్ అన్నారు. మండలంలోని గుండ్లపల్లిలో శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన మోదీ ప్రభుత్వం-సంకల్ప సాకారం అనే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మేకిన్ ఇండియా, ఆత్మ నిర్భర్, వికసిత్ భారత్ లక్ష్యంగా ఎన్నో చారిత్రక సాహోపేత నిర్ణయాలతో దేశాన్ని పరుగు పెట్టిసున్నా ఘనత ప్రధానిదేనని తెలిపారు. చిత్తశుద్ధి లేని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజా వ్యతిరేకత ఉందని, రాష్ట్రంలోని ప్రజలు బీజేపీ వైపు మొగ్గుచూపుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏలేటి చంద్రారెడ్డి, సొల్లు అజయ్‌వర్మ, పుల్లెల రాము, విలాసాగరం రామచంద్రం, అటికం రామచంద్రం, బండి తిరుపతి, బద్దం అనంతరెడ్డి, చెక్కిళ్ల చంద్రయ్య, విలాసాగరం రాజమల్లు, దొగ్గలి జగన్, బుర్ర చంద్రశేఖర్‌గౌడ్, జగన్, గట్టు కిషన్, స్వామిరెడ్డి, జాలి శ్రీనివాస్‌రెడ్డి, నరసింహస్వామి, పకిడి మహేందర్, గాదే వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదు'


మాట్లాడుతున్న సుంకె రవిశంకర్

కరీంనగర్: ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చేందుకు అడ్డగోలు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్న ఏ ఒక్క హామీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజా క్షేత్రంలో శిక్ష తప్పదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. కరీంనగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వాగ్దానాల ఎగవేతలో సీఎం రేవంత్‌రెడ్డి నంబర్ వన్ స్థానంలో ఉన్నాడని అన్నారు. రైతులను నిలువున ముంచిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని ఆరోపించారు. రైతు భరోసా పత్తా లేదని, రైతు బంధుకు కోతలు పెడుతూ దఫాదఫాలుగా వేస్తున్నాడని, రైతుబీమా అటక్కెందని విమర్శించారు. కాంగ్రెస్ మంత్రులు ఎమ్మెల్యేలు పదేపదే బీఆర్‌ఎస్, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, నాయకులు దూలం బాలాగౌడ్, చంద్రశేఖర్, మధుసూదన్ రెడ్డి, నవీన్‌రావు, మధుసూదన్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాలు


వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

హుజూరాబాద్: వాసవీ వనిత క్వీన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో వాకర్స్‌కు ఉచితంగా షుగర్ పరీక్షలు చేశారు. పెద్ద పాపయ్యపల్లి శివారులోని మంథనపల్లి గ్రామంలోని పంచముఖ ఆంజనేయ ఆలయానికి వాటర్ ట్యాంకు బహూకరించారు. చెప్పులు కుట్టే రాజయ్యకు సన్మానం చేసి నిత్యావసర వస్తువులు అందించారు. సరస్వతి పథకం కింద నిరుపేద విద్యార్థులకు లాంగ్ నోట్‌బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమురవెల్లి హరిప్రసాద్, ఉపాధ్యక్షుడు మండల యాదగిరి, కోశాధికారి శ్రీనివాస రెడ్డి, పంజాల శ్రీధర్, బత్తుల రాజలింగం, మాజీ అధ్యక్షుడు రమేష్, క్లబ్ ఇంచార్జి కృష్ణవేణి, లచ్చయ్య తదితరులు ఉన్నారు.

రవిచంద్రకు గద్దర్ అవార్డు



కరీంనగర్‌కల్చరల్: తెలుగు సినీ రంగంపై అనేక వ్యాసాలు, పుస్తకాలు రాసిన కరీంనగర్ ఫిలింసొసైటీ అధ్యక్షుడు పొన్నం రవిచంద్రకు పైడి జయరాజ్‌పై నిర్మించిన డాక్యుమెంటరీకి 2024 సంవత్సరానికి బెస్ట్ ఫిలిం క్రిటిక్‌గా రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ అవార్డు అందజేసింది. శనివారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి , సిని నిర్మాత దిల్‌రాజు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. పలువురు కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.




అంజనాద్రి గుట్టపై లక్ష్మీగణపతి, గిద్దె పెరుమాండ్ల ఆలయంలో ప్రత్యేక అలంకరణ


గోపాల్‌పూర్‌లో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

సంకటహర చతుర్థి

కరీంనగర్‌కల్చరల్: సంకటహర చతుర్థిని పురస్కరించుకొని నగరంలోని పలు ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అంజానాది క్షేత్రంలోని లక్ష్మీగణపతి ఆలయంలో స్వామి వారికి ఫలపంచామృతాలతో అభిషేకాలు,అర్చనలు చేశారు. రాంనగర్ గిద్దెపెరుమాండ్ల, కమాన్‌రోడ్డు రామేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దుర్గాభవానీ ఆలయంలో..

విద్యానగర్(కరీంనగర్): నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో గల లక్ష్మీగణపతికి విశేష అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, విశేష హారతి పూజ కార్యక్రమాలను ఆలయ పూజారులు వైభవంగా నిర్వహించారు. పూజల్లో ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గోపాల్‌పూర్‌లో..

కరీంనగర్‌రూరల్: గోపాల్‌పూర్‌లో స్వయంభూ వినాయక విగ్రహానికి భక్తులు పూలతో అలంకరించి పంచామృతాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో సాయిని తిరుపతి, గుంటి లక్ష్మణ్, రవి తదితరులు పాల్గొన్నారు.


దుర్గాభవానీ ఆలయంలో అభిషేకం

అందరూ ఏకమై ఆలయాలు నిర్మించారు

- విరాళం రూపంలో రూ.45 లక్షలు సేకరణ
- గోపాల్‌రావుపేట గ్రామంలో మూడు పురాతన ఆలయాల పునర్నిర్మాణం

రామడుగు: 'ఐకమత్యం మహాబలం' అన్న నానుడిని నిజం చేస్తూ మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామస్తులు అందరూ కలిసి శిథిలావస్థకు చేరుకున్న పురాతన ఆలయాలను పునర్‌నిర్మాణం చేశారు. గ్రామంలోని అన్ని కులసంఘాల నాయకులు ఏడాది క్రితం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొని గ్రామ పంచాయతీ వద్ద ఉన్న శ్రీహనుమాన్, నల్లపోచమ్మ, పోచమ్మ ఆలయాలను పునర్‌నిర్మించాలని తీర్మానం చేశారు. గ్రామానికి చెందిన నేచర్ యూత్ క్లబ్ సభ్యులు కార్యక్రమానికి ముందుకు రావడంతో పాటు గ్రామస్తులు సహకారం అందించారు. సుమారు 300 మంది దాతలు ఆలయాల నిర్మాణానికి విరాళం అందజేశారు. ఇప్పటి వరకు దాదాపు రూ. 45 లక్షలకు పైగా సేకరించి ఆలయాల నిర్మాణం పూర్తి చేశారు. ఏడాది పాటు నిర్మాణ పనులు కొనసాగాయి, ఇటీవల ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. గోపాల్‌రావుపేట గ్రామం మండలంలోని ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది. దాతల సహకారంతో ఆలయాల నిర్మాణం పూర్తికావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


గ్రామంలోని హనుమాన్ ఆలయం